క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: వైట్ గోల్డ్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏడీఈ సీతారాంనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సీతారాంపేట, నాగన్‌పల్లి, ఇబ్రహీంపట్నంలోని భాగ్యనగర్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, వైట్‌గోల్డ్, ఆక్టోపస్, తట్టిఖాన ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం నేడు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేత్ర సమస్యలు ఉన్నవారు శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కుర్మిద్దలో తాగునీటి ఎద్దడి



మహిళలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత

యాచారం: ఎండకాలం ప్రారంభం కాకముందే కుర్మిద్ద గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై మహిళలు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఒకటి, రెండు వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మయ్యకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆదివారం నగరంలోని తన నివాసంలో అందజేసి మాట్లాడారు. అనారోగ్యానికి గురైన పేదలు.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, నాయకులు జంగయ్య, జయప్రకాశ్, మల్లేశ్, చింటుగౌడ్, బండరాజు, మహేశ్, అర్జున్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను వేగవంతం చేయండి



సర్వే వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీఓ అనంతరెడ్డి తదితరులు

మంచాల: రైతు భరోసా పథకం సర్వేను వేగవంతం చేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో తహసీల్దార్ ఎం.వీ. ప్రసాద్, ఆర్ఐ రమేష్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. సర్వే గురించి ఆరా తీశారు. గ్రామసభలు ఇతర కార్యక్రమాలకు ఇబ్బందులు తలెత్తకుండా భూ సర్వే చేయాలని సూచించారు. రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, వీఆర్‌ఓలు యాట భాస్కర్, ఎం.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లో సోమవారం రూ.9.50 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి తెలిపారు. సీసీ, బీటీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి రానున్నారని వెల్లడించారు.

రేషన్ ఆశలు

- పేదల నిరీక్షణకు తెర
- పురపాలికలో పూర్తికావచ్చిన సర్వే
- రేపటి నుంచి గ్రామ సభలు
- కొత్తగా దరఖాస్తుల స్వీకరణ
- వెలువడనున్న అర్హుల జాబితా



ఇబ్రహీంపట్నం: కొత్త రేషన్ కార్డుల నిరీక్షణకు తెరపడనుంది. తెలంగాణ ఆవిర్భావం నుంచి నేటి వరకు కొత్త కార్డులను గత ప్రభుత్వాలు జారీ చేయలేదు. కొత్తవారికి ఇవ్వలేదు. ఉన్నవారిలో ఎవరైనా చనిపోయినా, యువతీయువకుల వివాహాల అనంతరం వేరు పడిన తరువాత అప్పటి వరకు కుటుంబీకులతో కలిసి ఉన్న కార్డులో వారి పేర్లను తొలగించడం వరకే సంబంధిత అధికారులు పరిమితమయ్యారు. కొత్తగా నమోదు, మార్పులు, చేర్పులకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో అర్హత ఉండి రేషన్ బియ్యం, ఇతర సంక్షేమ పథకాలను పొందలేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. సుదీర్ఘ కాలం అనంతరం ప్రస్తుత ప్రభుత్వం.. లేని వారికి కార్డులు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టడంతో పేదల్లో రేషన్ ఆశలు చిగురించాయి.

ముగిసిన సర్వే

గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం.. నిర్వహించిన ప్రజాపాలన, సమగ్ర కులగణన సర్వేలో తమకు రేషన్‌కార్డులు లేవని ఇబ్రహీంపట్నం మండల పరిధి 14 గ్రామాల నుంచి 567 మంది, పట్నం మున్సిపాలిటీ పరిధిలో 335 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ జాబితాను ప్రామాణికంగా తీసుకున్న అధికార యంత్రాంగం.. ఈ నెల 16 నుంచి క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తోంది. ఆన్‌లైన్ అర్జీలను పర్యవేక్షిస్తున్నారు. సర్వే.. పూర్తి కావొచ్చింది.

21 నుంచి 23 వరకు

ఈ నెల 26న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ లోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నిన్నమొన్నటి అర్హుల జాబితాను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం.. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గ్రామ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించనుంది. ఇందులో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే.. అర్జీ పెట్టుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుండా.. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంత మంది అర్హులను ప్రకటించనుంది.



ముకునూర్‌లో రేషన్ కార్డు సర్వే చేస్తున్న గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్

మార్పులు, చేర్పులు చేపట్టాలి



కొత్త రేషన్‌కార్డులతో పాటు పాత కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలి. వివాహం అనంతరం అత్తవారి ఇళ్లకు వెళ్లిన ఆడబిడ్డల పేర్లను.. అమ్మవారి ఇంటి రేషన్ కార్డుల నుంచి తొలగించారు. కానీ.. మెట్టినింటి కార్డులో నమోదు చేయలేదు. అక్కడ చేర్చుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ స్థిరపడిన వారి కార్డుల బదిలీకి అవకాశం కల్పించాలి. ఈ అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

– రుక్మారెడ్డి, ఇబ్రహీంపట్నం

పారదర్శకంగా ఎంపిక



పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తాం. 335 మంది రేషన్ కార్డులు లేవని కులగణన సర్వేలో దరఖాస్తు పెట్టుకున్నారు. అందులో సుమారు 40 మంది చిరునామా లభించలేదు. వారి ఫోన్ నంబర్లు పనిచేయడంలేదు. రేపటి నుంచి వార్డు సభలను నిర్వహిస్తున్నాం. కొత్త దరఖాస్తులను స్వీకరిస్తాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక కొనసాగుతోంది.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

బురుజు మరమ్మతులకు వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన చారిత్రక బురుజును మరమ్మతులు చేయించేలా చూడాలని కోరుతూ ఆదివారం మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డికి బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలాపూర్‌లో ఉన్న చారిత్రక బురుజు శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపడితే చారిత్రక కట్టడాలు నేటి తరానికి అందించినవారమవుతామన్నారు. బురుజు దిగువన వెలిసిన అమ్మవారి గుడికి కూడా మరమ్మతులు చేపట్టి భక్తులకు దర్శనం కలిగించేలా చూడాలని కోరారు. బురుజుతో పాటు గ్రామంలో ఉన్న యూత్ భవనాన్ని కూడా విశాలం చేసేందుకు అలాగే అక్కడే గణపతి నవరాత్రుల సమయంలో సెక్యూరిటీ భద్రతకు వస్తున్న పోలీసులకు, ఇతర సిబ్బందికి వసతి కల్పించేలా మరో గదిని నిర్మించుకునేలా నిధులు మంజూరి చేయించాలని మేయర్‌కు విన్నవించామన్నారు. నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని మేయర్ పారిజాత హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివాలయ కమిటీ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, వంగేటి సుధాకర్‌రెడ్డి, సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం సాయి, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుంట సత్యనారాయణరెడ్డి, పన్నాల వేణుగోపాల్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, దుబ్బ చింటు తదితరులు ఉన్నారు.



మేయర్ పారిజాతకు వినతిపత్రం ఇస్తున్న గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

ఆమనగల్లు: ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయాలని సీఐ శివప్రసాద్ కోరారు. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో 2012–13 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి యువజన సంఘాలు కృషి చేయాలని సూచించారు. రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 40 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఆమనగల్లు: అర్చకులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని దూప, దీప, నైవేద్య అర్చకసంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశర్మ కోరారు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘం మండల అధ్యక్షుడు బానావత్ హేమ్లానాయక్ ను ఆదివారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో అర్చకులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్‌శర్మ, కోశాధికారి సునీల్‌జోషి, ప్రధాన కార్యదర్శి రామానుజాచార్యులు, నాయకులు సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు పంచుతున్న పార్టీ నేతలు

ఇబ్రహీంపట్నం: సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఆదివారం దండుమైలారం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జగన్ మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఎం అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను మహాసభల్లో రూపొందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగస్వామి, రమేష్, యాదగిరి, వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ సంఘ నాయకులు చరణ్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

ధర్మగిరి టు రైల్వేగేట్ రోడ్డు.. విస్తరణ తూచ్..!

- స్థానికుల నుంచి అభ్యంతరాల వెల్లువ
- రహదారి విస్తరణపై పునరాలోచన
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్న అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. ప్రస్తుత రహదారిని 80 ఫీట్ల రహదారిగా విస్తరించేందుకు హెచ్‌ఆర్‌డీసీ సిద్ధం కాగా.. స్థానికులు నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రహదారి విస్తరణపై అధికారులు ప్రత్యమ్నాయం వైపు మొగ్గుచూపుతుండటం గమనార్హం.

ఎందుకు..?

ధర్మగిరి రోడ్డు ఎరుకల గడ్డ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణలో 208 మంది బాధితులున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇందులో కొందరి ప్లాట్లు, కొందరి ఇళ్లు పాక్షికంగా మరికొందరి ఇళ్లు పూర్తి స్థాయిలో కోల్పోయే అవకాశం ఉండటంతో రహదారి విస్తరణపై స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. భారీగా ఆస్తులు కోల్పోయే వారికి ప్రత్నామ్నాయం ఎలా చెల్లిస్తారనే ప్రశ్నలూ వెల్లువెత్తాయి. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ రూపొందించకముందు నుంచీ స్థానికంగా నివాసాలున్నాయని అలాంటి వాటిని ఎలా తొలగిస్తారని కూడా ప్రశ్నిస్తున్నారు.

పరిహారం కూడా..

ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం చెల్లించే విషయం కూడా గుదిబండగా మారుతుందనే ఆందోళన నెలకొంది. ఈ కారణంగా ప్రత్యామ్నాయ మార్గంలోనే రహదారిని చేపడితేనే ఎంతో మేలని మున్సిపల్ అధికారులు సైతం భావిస్తున్నారు. పరిహారం చెల్లింపు కన్నా ప్రత్యామ్నాయమే బె టర్ అనే అంశం కూడా ప్రస్తుతం తెరపై వచ్చింది.



ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటుకు వెళ్లే రహదారి

కీలక సమస్య...

ఈ రహదారి విస్తరణ చేపడితే రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదనలున్నాయి. రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తే తప్ప రహదారి విస్తరణతో ఎలాంటి ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పాత పోలీస్‌స్టేషన్ రహదారిలో కూడా ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా సంబంధిత రహదారి విస్తరణపై అధికారులు ఆలోచించాలనే వాదనలు కూడా లేకపోలేదు.

రేపటి నుంచి వార్డు సభలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే వార్డు సభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న మునగనూర్, రాగన్నగూడ, కోహెడ, తొర్రూర్, బ్రాహ్మణపల్లిలో, 22న ఇంజాపూర్, ఉమర్‌ఖాన్ గూడ, తుర్కయంజాల్‌లోని వార్డు కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. ఎవరైనా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలనుకుంటే కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, కులం, పూర్తి చిరునామాతో అర్జీ పెట్టుకోవాలని సూచించారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ప్రభుత్వ పథకాల అర్హుల ఎంపిక కోసం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ కుసుమమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఆకుతోటపల్లి, మాలెపల్లి, చింతలపల్లి, కోనాపూర్, కొత్తకుంటతాండా, 22న మేడిగడ్డతండా, మంగళపల్లి, పోలెపల్లి, రాంనుంతల, సీతారాంనగర్‌తండా, శెట్టిపల్లి, శంకర్‌కొండతండా, సింగంపల్లిలో సభలు నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు.

యాచారంలో..

యాచారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు మండల పరిధి గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. 21న నందివనపర్తి, నస్దిక్ సింగారం, మంతన్‌గౌరెల్లి, అయ్యవారిగూడెం, మల్కీజ్‌గూడ, కేసీతండా, 22న గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల, చౌదర్‌పల్లి, గునుగల్, ధర్మన్నగూడెం, యాచారం, 23న తక్కళ్లపల్లితండా, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, మాల్, నల్లవెల్లి, కొత్తపల్లి, 24న కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, చింతపట్ల, తాడిపర్తి, నానక్‌నగర్, మొండిగౌరెల్లిలో సభలు ఉంటాయని, ప్రజలు పాల్గొనాలని సూచించారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

యాచారం: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగనున్న రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని ఆదివారం చింతపట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభలకు ప్రజలు ఆర్థిక సహాయం చేసి సహకరించాలని కోరారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, ఎర్ర జెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నిబంధనలు విధించకుండా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా రూ.2 లక్షల లోపు రుణాలున్న రైతులకు మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలంపల్లి జంగయ్య, వెంకటయ్య, పద్మ, సత్యం, గిరికాంత్, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

సాగు భూములకే రైతుభరోసా

తహసీల్దార్ సైదులు



ఘట్టుపల్లిలో భూ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: సాగుకు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా వర్తిస్తుందని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, భాగ్ మంఖాల్ గ్రామాల్లో రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం ఆయన రెవెన్యూ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగుకు యోగ్యత లేని భూములకు రైతు భరోసా దక్కదన్నారు. ప్రధానంగా రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైస్ మిల్స్, కంపెనీలు ఉన్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములు, చెరువులు, కుంటలలో ఉన్న భూములకు రైతు భరోసా వర్తించదన్నారు. భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అంతకుముందు గ్రామాల్లో పలు భూములు, రికార్డులు, మ్యాపులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్ఐలు స్వర్ణకుమారి, పావని, సీనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కందుకూరు: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో స్థానిక నాయకుడు గోరింకల రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో యువత సన్మార్గంలో నడవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. కాగా గోరింకల రమేశ్ అన్ని జట్లకు టీషర్టులను స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పంతునాయక్, మాజీ సర్పంచ్ బుక్క మహేశ్, మాజీ వార్డు సభ్యుడు గోరింకల రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు చిందం శ్రీనివాస్, కొంగళ్ల శ్రీను, కొంగళ్ల శంకర్, గద్దగూటి శేఖర్, ఎలుగపల్లి నర్సింహ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ కృష్ణంరాజు

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆదివారం ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని, అదేవిధంగా బ్రహ్మోత్సవాలను ప్రభుత్వపరంగా నిర్వహించేలా ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా చూడాలని ఆమెను కోరినట్లు తెలిపారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్

అ'పూర్వ' సమ్మేళనం

మంచాల: మూడు దశాబ్దాల అనంతరం ఆ విద్యార్థులు ఒకే వేదికగా సందడి చేశారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. బాల్యం జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991– 1992 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న చిననాటి స్నేహితులు.. ఆదివారం కాగజ్‌ఘట్ గ్రామంలోని ఓ రిసార్ట్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 33 సంవత్సరాల తరువాత కలుసుకొని, నాటి చిలిపి చేష్టలను గుర్తుకు చేసుకుంటూ.. సంతోషంగా చిందులు వేశారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు.



విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం